# ప్రయాణము!

రచన :
శ్రీ కృష్ణమూర్తి పట్నాయక్

'ఇది మూడో ట్రాము, వెళ్లిపోయింది! ఎంత సేపటి నుంచి మీరు నిల్చున్నారు?'

'ఇది ఏడో ట్రాము నాకు. రైలు వచ్చే వేళ అయిపోతూంది. ఎలా అందుకోవడమో తోచదు. నేను ఇవాళే వెళ్లాలి.'

'కాని, మీరు ఒకగానిలోనూ ఎక్క ప్రయత్నించలేదే! కొంచెం జబర్దస్తీ చేయకపోతే...'

'జబర్దస్తీ! జబర్దస్తీ హింసకిందికి వస్తుంది. కొంచెం రద్దీ తక్కువగా వున్న ట్రాముని చూస్తున్నాను'

మొదటతను ఆశ్చర్యపోయి రెండో అతణ్ని ఎగాదిగా చూశాడు. 'అయితే ఇంత సేపూ నిలుచుని 'లా' పాయింట్లని ఆలోచిస్తున్నారన్నమాట. మీరు యింటి నుంచి కదలకపోవలసింది?' అన్నాను.

'ఉహూఁ! అదికాదు. జబర్దస్తీలేకుండానే పోదామని. నాది స్థూలకాయమా మరి!' నవ్వాడు రెండో అతను.

అంతలో ఇంకో ట్రాము వచ్చింది. మొదటి అతను, రెండో అతణ్ని రెక్కపట్టుకొని ముందుకు తోస్తూ, 'కదలండి వేగం! ఇలాంటి ఆలోచనలకి తావులేదిక్కడ... మీ ఈ స్థూలకాయం ఇలాంటిసమయాల్లో బాగా ఉపయోగిస్తుంది!' అని గట్టిగ ట్రాములోకితోసి తను అతని వెనుక ఏర్పడ్డ ఖాళీస్థలంలో ఇముడుకున్నాడు.

ట్రాములోనివాళ్ళు మండిపోయారు.

'అబ్బోతులా అలా ట్రాములోనికి తోసుకొస్తావేమిటయ్యా? నలుసుకే నిలువ చోటులేకపోతే ఈ మోతుబరితన మేమిటి నీకు?' చెరొక మాటా అంటూన్నారు.

పలుచనతను వాళ్ళను సముదాయించి వూరుకోబెట్టాడు.

ట్రాము కదిలిపోయింది. దుక్కతను కష్టంమీద వాచీతీసి దృష్టిమరల్చాడు. 'ఇంకా ఇరవై నిముషాలున్నయ్ ట్రెయినుకి. నా అదృష్టంబాగుంది. లేకుంటే ఈ ట్రాములో ఎక్కలేకపోదును!' అన్నాడు.

'నా అదృష్టమూ బాగుంది! లేకుంటే మీ ఆసరా నాకు దొరక్కపోను!' పలుచనతను నవ్వాడు.

దుక్కఅతనూ నవ్వాడు.

'జబర్దస్తీగదూరి మమ్మ్ము చంపింది చాలక ఇంకా నవ్వుతాడితను!' ట్రాములోని వాళ్ళు విసుక్కున్నారు.

'ఏమండోయ్! ఇదికూడా హింసకిందికి రాదూ? నవ్వకండి మరి!' అన్నాడు పలుచనతను.

'క్షమించండి. మీ అందరికీ కష్టంగ వుంటే నవ్వను మరి! పోతే మీరు ఎంతవరకెళ్తారండీ?' అడిగాడు దుక్కతను పలుచనన్ని.

'ఈ బండికే వెళ్తున్నాను.'

'ఏ ఊరికి?'

ఫలానా ఊరని పలుచనతను చెప్పాడు. దుక్కతను సంతోషంతో, 'బాగుంది! నేనూ ఈ బండికే ఆ ఊరు వెళ్తున్నాను. తోడుగా ఒక స్నేహితుడంటూ లేకపోతే నాకుపడదు, హింసకిందికి రాకపోతే ఇక మిమ్ము బాధిం ఏ పనీ చేయను!' అన్నాడు.

ట్రాములోని వాళ్లంతా నవ్వారు.

రైలుస్టేషను దగ్గరపడుతోంది. అయినా కండక్టర్ జాడేలేదు. దుక్కతను అనిమిత్తంగ 'ఇంకా టికెట్లుకొనలేదు. ఒకటో రెండో స్టాపులుమాత్రం వున్నాయి. ఈ కండక్టర్ ఎక్కడ ఉన్నట్టు? గొణుక్కుంటూ కండక్టర్ కోసం కలయజూశాడు.

పలుచనతను ఇది చూసీచూడనట్టు ఊరుకొన్నాడు. కానీ మళ్ళా దుక్కతను అదే గొణుగుడు ఆరంభించేసరికి 'మీరు కండక్టర్ కోసం ప్రపంచం అంతా వెదికి పట్టుకొని టిక్కట్టుకొని మరీ ట్రాము దిగేటట్టున్నారు!' అన్నాడు.

'టికట్టులేకుండా ప్రయాణం......ఇప్పటికే యింత దూరం ప్రయాణం చేశాను!'

'మీకు అంత పట్టింపువుంటే కండక్టర్ కోసం కాచుకూర్చోండి. అతను డ్యూటీ అవర్స్‌లో ఎప్పుడో ఒకమారు వీలుచూసుకుని మీదగ్గరకువస్తే టిక్కట్టు కొనుక్కుని మరీ ట్రాముదిగండి!'

దుక్కతను ఏమీ చలించలేదు. టిక్కట్టు డబ్బులు జేబునుంచి తీశాడు.

స్టేషను వచ్చేస్తోంది. నే నిక్కడ దిగిపోతానండీ — టికట్టు లేకుండానే! నాలాంటి భ్రష్టులు తమలాంటి భక్తులసన్నిధిని ఉండకూడదు. కండక్టర్ని చూశారా? ఎక్కడున్నాడు? అదిగో ట్రాము ఆ చివర! ఈ మధ్య కనీసం అరవయిమందైనా ఉన్నారు. మీరు పిలిచినా, అతను విని గాదలచినా, మీదగ్గిరికి అతను రావడానికి అరగంట పడుతుంది. పోనీ, మనమైనా అతనిదగ్గిరికి వెళ్ళగలమా అంటే అదీకాదు. అవునా? మరొక కండక్టర్ని పెడితే కంపెనీకి ఏంనష్టం? రడీగ ఉండండి... వచ్చేస్తాపే మనది. లేకపోతే దిగలేం!'

సుక్కుతను వాచీ చూసుకొన్నాడు. టైము ఆట్టే లేదు. అరే. ఏం చేయడం? విధిలేక ట్రామునుంచి బైట పడేటందుకు అతను పలుచనతణ్ని అనుసరించాడు.

సుక్కుతను ఒక స్నేహితుని కారులో వచ్చినందుకు స్టేషన్ వదవుండే జనాన్ని చూడలేదు. అందుచేత స్టేషనులో దిగేసరికి దంలో ఒక జన మహాసముద్రంలో మునిగి పోతూన్నట్లు అనిపించింది అతనికి. రైల్లో ఎక్కాలంటే ఈ సముద్రాన్ని దాటాలి.

పలుచనతని కోసం చూశాడు. అతను కనబడలేదు. అరే! ఏమయ్యాడు? అతనులేనిదే తను ఎలా ప్రయాణం చేయగలడు? అతని పేరేమిటోకూడా కనుక్కోలేదు. ఎంత మతిమాలినపని! తన అంతస్థునూ, నాగరికతనూ మరచి భయంతో 'ఏమండోయ్? ఎక్కడున్నారు?'అని కేక వేశాడు.

పలుచనతను ఆ వెనకనే ఒక గుంపుచాటున ఉన్నాడు. ఆ కేకవిని తలెత్తిచూసి, 'ఇక్కడండోయ్! చివరకు ట్రాము దిగేశారన్నమాట, టికట్టు తీసుకున్నారా? అన్నాడు.

'లేదు.'

'ప్రతిపనికీ అనవసరంగ ఆలోచిస్తూ మీ పని పాడు చేసుకుంటూన్నారు.'

'నాకేమీ బాగుండలేదండీ ఈ ప్రయాణం? మీ పేరేమిటో నే తెలుసుకోవచ్చా?'

'నా పేరు వెంకట్రావు,'

'నా పేరు సీతాపతి. మీరు కనబడక పోయేసరికి గాభరాపడి...ఏమని పిలవాలో తెలిసిందికాదు.'

వెంకట్రావు నవ్వి 'సరే, పదండి, ఆ పడుకున్న సాధుని — కాదు — అహింసాజీవిని దాటి యిలారండి... వేగం...ఇంకా గుములుతారేమిటి? మరోత్రోవ లేదు!' అన్నాడు.

సీతాపతి నిల్చుతూనే కాషాయ వస్త్రాలు ధరించి — త్రోవకి అడ్డంగ పడుకొన్న' ఆ సాధుమీదినుంచి ఒక్క అంగ వేసి దాటి వెంకట్రావుని చేరుకున్నాడు.

'బయలుదేరవ వేళావిశేష మేమిటో గాని అన్నీ చిక్కులే! సభ్యతా, సంస్కారమూ అంతా మంటగలిపి యిలా ప్రయాణం చేయడ మేమిటి?' అన్నాడు కించ పడుతూ

'మళ్ళా ఆ సణుగుడేమిటి? నే దారితీస్తా. నా వెనకనే రండి. సభ్యతా, సంస్కారమూ ఎట్సెట్రా గురించి ఆట్టే ఆలోచించకండి చేయక విధి లేనప్పుడు చేయక తప్పుతుందా? ఇన్ని అవస్థలకు కారకులయిన వారిని శపిస్తుంటే ఆడగండి' అంటూనే వెంకట్రావు జనం మధ్యనుంచి తోసుకొంటూ అక్కడక్కడా సర్కస్ ఫీట్లు వేస్తూ గేటుదగ్గరికి చేరుకొన్నాడు. సీతాపతి అతణ్ని అనుసరించాడు కాని సీతాపతి వెంకట్రావుని అక్కడ ఆపి, 'టికట్లుతీసుకుని ప్లాటుఫారం మీదికి వెళ్దాం, రండి, అన్నాడు.

'వెంకట్రావు నవ్వుతూ, అదిగో, అదే బుకింగ్ ఆఫీస్ చూశారా? ఎలావుంది?' అన్నాడు.

'అరే! అక్కడ ఒక్క మనిషీ లేడేం !'

'ఒక్క టికట్టుకూడా లేదు! బుక్కింగు యెప్పుడో బందు అయిపోయింది!'

'అయితే ఇప్పుడెలా వెళ్ళడం?' షాక్ తిన్నవాడిలా అయి ప్రశ్నించాడు సీతాపతి.

'లంచం!...లంచం అనే మాట వినలేదూ? మీరు మరో ప్రపంచంనుంచి దిగివచ్చినట్టున్నారే !'

సీతాపతి ఆశ్చర్యపోయి, 'లంచమా? లంచం దేనికి?' అడిగాడు.

'ఇదిగో, ఈ గేటుదాటి ప్లాటుఫారం మీదికి వెళ్ళడానికి, బండిఎక్కి అందులో వుండడానికి, అక్కడ బండిదిగి గేటుదాటి మనవూళ్ళోకి వెళ్లడానికి! అన్ని చోట్లా లంచం, లంచం! ఇల్లు వదిలాక మళ్ళా చేరుకోడానికి (దైవం అనుగ్రహిస్తే — పాపం శమించు గాక) లంచమే శరణ్యం !'

'అయితే నన్ను లంచం ఇమ్మంటారా? నేను... నే నెవరో మీకు '

వెంకట్రావు యిదేదీ వినిపించుకోక వెళ్ళిపోతున్నాడు.

సీతాపతికి జరూరు పని వుంది. ఆ ట్రెయినులోనే వెళ్లాలి వేరే మార్గం అతనికి కనుపడలేదు. 'ఆగండి. ఆగండి! నేనూవస్తూన్నా! నేను ఇవ్వాళే వెళ్లితీరాలి' అన్నాడు.

'ఇలాంటప్పుడు ఎవరికివారే సహాయం చేసుకోవాలి. మీ సూటూ బూటూ కొంచెం పనికివస్తాయి. వేష మహిమ లేదూ? ఒక్కొక్కప్పుడు లంచమిచ్చినా పుచ్చుకోరు. బండిలో చోటు ఉంటేగా లంచానికి ఆశపడి ఎలాగో ఒకలాగ ఎక్కించడానికి? మీ వచ్చే లంచం తీసుకుంటే మీరు అదృష్టవంతులే అనుకోండి! అయితే దారిపొడుగునా బాకీ న్యాయజిజ్ఞాస ఏమిటి? మీరు చేసే పని మీకు తప్పుగా తోచవచ్చు. కాని మీముందు సాక్షాత్కరించే ఈ దృశ్యాల్లో ఏవి సబబుగా ఉన్నాయి? రైల్వే, లాభానికే నడవాలి, కాదనను. కాని — ప్రయాణీకుల రద్దీని తట్టుకొనేటట్లు మరికొన్ని పెట్టెలో లేక మరొక బండో రైల్వేవాళ్లు ఏర్పాటు చేయకపోతే మనమేం చేస్తాం? నిజానికి నష్టి మనకేకాని, రైల్వేకి కాదు. డబ్బు యిస్తామన్నా టికట్లు దొరకవు. లంచం యిస్తామంటే — అసలు చార్జీకన్న ఎక్కువ ఇవ్వాలి. ఒకవేళ ఎలాగో బండియెక్కినా వాము యాతన తప్పదు. ఒక్కొక్కప్పుడు యమలోకానికి కూడా వెళ్లక తప్పదు. (పాపం శమించుగాక!) బాబూ పగవాడికైనా వద్దు యీ కష్టం! సమీక్ష చెప్తూనే వెంకట్రావు గేటుదగ్గిరికి వచ్చి 'ఒక ఐదు తిసి... ఇద్దరమని చెప్పండి .. మెల్లిగా,' అన్నాడు సీతాపతితో,

ఎలాగో బండిఎక్కారు. బండి ఎక్కేసరికి సీతాపతి తలప్రాణం తోకకువచ్చింది. ఇక బండిలోపడ్డ యాతన వెంకట్రావు చెప్పినదానికి మించేవున్నది.

సీతాపతికి ఇప్పుడు మరోసమస్య ఎదురయింది. తన ఊరి స్టేషనులో దిగి గేటు ఎలా దాటడం? వెంకట్రావు ఉండనే ఉన్నాడు. లంచమూ ఉంది. కాని, అతను ఇక వెంకట్రావు ఉపాయంపైగాని, లంచంయొక్క శక్తిపైగాని ఆధారపడ దలచలేదు. అతని మెదడులో ఏదో ఆలోచన మెరిసింది.

బండి వాళ్ల వూరి స్టేషనులో ఆగింది. ఎంతో జనం దిగారు. వెంకట్రావూ, సీతాపతీ దిగిపోయారు. కాని, సీతాపతి తెలిసి తెలిసీ జనంలో కలిసిపోయి వెంకట్రావుని తప్పించుకున్నాడు.

తరవాత అతను ఎవరో బంధువులనో, లేక మిత్రులనో బండిలో ఎక్కించి వస్తున్నవాడిలా తేలిగ్గా చేతి కఱ్ఱ వూపుకుంటూ గేటు సమీపించాడు.

ఆశ్చర్యం! టికట్ కలెక్టర్ అతడికి వినయంగా నమస్కరించి దారి విడిచిపెట్టేశాడు.

\+ × +

మేజిస్ట్రేటు గారు కేసుల్ని విచారిస్తున్నారు. రైలు టికట్టు లేకుండా ప్రయాణం చేసే కేసు ఒకటి వచ్చింది.

నేరస్థుడు, తను టికట్టు తీసుకున్నాననీ, తోవలో జేబుదొంగ తన పర్సుతోసహా టికట్టు కాజేశాడనీ అందుకు నిదర్శనంగా తన కత్తిరించబడ్డ జేబు చూడవచ్చననీ అంటూన్నాడు.

మేజిస్ట్రేటు నేరస్థుని పిలిపించారు. నేరస్థుడు వచ్చి నమస్కారం చేశాడు.

ఎవరా నేరస్థుడు? మేజిస్ట్రేటు గారు చూశారు. మసకమసకగా కనబడితే కళ్ళద్దాలు ఒకమారు తుడిచి తగిలించుకొని మళ్ళా పరికించి చూశారు. చూస్తూనే నివ్వెరపోయారు!

'వెంకట్రావా?' అప్రయత్నంగా మేజిస్ట్రేటు నోటివెంట ఆశ్చర్యంతో కూడిన ప్రశ్న వచ్చింది.

'అవును! సీతాపతి గారూ! మేజిస్ట్రేటు గారు తమరేనా?' ఆశ్చర్యంతో నిలుచుండి పోయాడు వెంకట్రావు. అతనికి నోటివెంట మరి మాట రాలేదు.

సీతాపతి మేజిస్ట్రేటు గారికీ నోట మాట రాలేదు.

ఇద్దరూ ఒకరినొకరు ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.

